# అన్వేషణ

## "కనుపించుటలేదు"

చెవిటపల్లి గ్రామవాస్తవ్యులైన కొరవలపు సుబ్బారావుగారు తెలియపర్చిన దేమనగా,

'గత నాలుగు దినములనుండి నా జ్యేష్ఠ పుత్రుడు కనుపించుటలేదు. పేరు కృష్ణావతారము. వయస్సు తొమ్మిదిసంవత్సరాలు ఎత్తు మూడు అడుగుల ఆరు అంగుళములు. శరీరపు వర్ణన కొరనలుపు. ముఖం నుదుట పెద్ద మచ్చ. శరీరపు చొక్కారంగు ధూమ్రవర్ణము.

వరాః- పిల్లవాడిని పట్టి తీసుకొచ్చినవారికి ప్రయాణపు ఛార్జీలు, నూటపదహార్లు సమర్పించుకొని సత్కారము చేయగలవాడను.

అని ఆనాటిపత్రికలో తప్పిపోయిన పిల్లవానితాలూకు ఫోటో ఒకటిఅచ్చు వేయబడిఉన్నది. ఈ ప్రకటన నాకెంతో ఆనందము కలుగజేసినది. కారణము లేకపోలేదు చెవిటపల్లి మా గ్రామానికి నాలుగుమైళ్లే ఉంటుంది. తప్పించుకొన్న కుఱ్ఱవెధవ మా ఊరువచ్చి రైలెక్కాల్సిందే. ఈ నాలుగు రోజులలో ఎక్కడికి వెళ్ళి వుండడని, ఈ ప్రాంతములలోనే ఎక్కడో తిరుగుతూ ఉంటాడని అనుకొన్నాను.

ఇక నేనొక కార్యక్రమము తయారుచేసుకొని వెంటనే కార్యానికి ఉపక్రమించాను. నేను ఏ పని చేసినా నూటపదహార్లు కండ్లముందు తాండవమాడుతున్నాయి. కొంత పొట్లలో ఆహారమును పడవేసుకొని ఆ రోజు దినపత్రిక చేతపట్టుకొని టేపు ఒకటి జేబులో వేసుకొని బయల్దేరాను.

నేను రైల్వేస్టేషనుకు వెళ్ళేసరికి పట్టణము బండి ఒకటి కూతవేసుకొంటూ వచ్చి ప్లాటుఫారముపై నిలబడి వుంది. నేను హడావుడిగా ప్రతిపెట్టెను గాలించటము మొదలెట్టాను. ఒక పెట్టెలో కుఱ్ఱవెధవ ఒకడు బెంచీల క్రింద నక్కి కూర్చుని నన్ను చూస్తున్నాడు.

నాకు అనుమానము వేసింది. తప్పకుండా వాడే వీడయి వుంటాడనుకొని పత్రికలోని ఫోటోతో పరిపోలుస్తున్నాను. ఫోటోతో దగ్గఱ పోలికలు నాకు కనపడ్డాయి. వెంటనే బయటికి లాగుకొని వచ్చి గబగబ టేపుతీసుకొని కొలత వేసుకొన్నాను. ప్రకటించిన కొలతకన్నా కొంత ఎక్కువే ఉన్నాడు. పేపరులో ఏమన్నా తప్పు పడిందేమోనని సరిపెట్టుకొన్నాను.

చొక్కా కూర్చాడలే వుంది. మురికిపట్టి చినుగులు పట్టిన చొక్కా తొడుక్కొని ఉన్నాడు. ముఖం నుదుట రూపాయి కాసంత మచ్చయున్నది. నేను ఆదరముతో చెయిపట్టుకొని "నీ పేరేమిటబ్బాయి" అని అడిగాను. అప్పటి వరకు నన్ను ఓరాకొసిని చూస్తున్నట్టు చూస్తున్నాడు.

పట్టణము రైలుబండి మెల్లగా ప్లాటుఫారమును విడువపోతున్నది. ఉన్నట్లుండి కుఱ్ఱవెధవ నా చేతిని కసిదీర కొఱికి రక్తముకళ్ళజూచి మరీవెళ్ళాడు. నేను నిర్ఘాంతపడిపోయి తిరిగి తేరుకుని వాడికోసము రైలు వెంబడి కొంత దూరము పరిగెత్తాను. వాడు పెట్టెలోనుండి కొంటెగా వెక్కిరించాడు. హతాశుడనై ఈ తొలి ప్రయత్నము భగ్నమైపోగా కాళ్ళీడ్చుకొంటూ తిరిగి వచ్చాను. మర్నాడు మా ఊరిచివరలో నున్న అనాథశరణాలయానికి వెళ్ళాను. నాకు ఇక్కడ చుక్కెదురయింది. గేటు దగ్గఱ ఘూర్ఖా వాడొకడు భుజాన తుపాకి ఒకటి వేసుకొని పహరాకాస్తున్నాడు. వాడిని చూచేసరికి పై ప్రాణాలు పైనే పోయాయి. వాడు నన్ను చూచి చెయిచాపాడు.

ఘూర్ఖావాడు తప్పక బీడీ కొఱకే చెయిచాపాడని తలంచి రెండు బీడీలు చేతిలో పెట్టాను. రెండు బీడీలు చాలలేదేమో కండ్లెఱ్ఱజేసి నన్ను మ్రింగేద్దామన్నట్లు చూస్తున్నాడు. ఇంకో నాలుగు బీడీలు తీసి చేతిలో పెట్టబోతున్నాను. నా రెండు బీడీలు మొహానకొట్టి "అరే బేవకూఫ్ జావ్ రే, జావ్!" అంటూ తుపాకిని చూపించాడు. నాకు అక్కడ ఉండుట ఉచితముగా తోపక పహరా గోడచుట్టూ ప్రదక్షిణం చేస్తూ, తోటలో పనిచేయుచున్న అనాథల బాలురను జాగ్రత్తగా పరిశీలించాను. నాకు కావలసినవాడు దొరకలేదు.

లోనికెట్లయిన ప్రవేశిద్దామనుకొనేటంతలో కారు ఒకటి లోనికి ప్రవేశించబోతున్నది. ఘూర్ఖా గేటు తెరచుటకు వెళ్ళాడు. ఇదే సమయమనుకొని కారువెనక పట్టుకూర్చొని లోనికి జొరబడిపోయాను.

నాకు కావలసినవాడికోసమై శరణాలయం గదులన్నియు వెదికాను. పత్రికలోని ఫోటో ప్రతివారికి చూపించాను. మాకు కనుపించలేదంటే మాకు కనుపించలేదన్నారు. హతాశుడనై ఘూర్ఖా వేడిచూపులతో కొంపకు చేరుకొన్నాను.

పదిదినములు గడిచినప్పటికీ వాడు దొరకలేదు ఒకవేళ మనసు మార్చుకొని ఇంటికి చేరుకొన్నాడనే సందేహం కలిగింది.

చెవిటపల్లి వెళ్ళి సుబ్బారావు గారి ఇల్లు వాకబుచేశాను. తీరా వారింటికి వెళ్ళేసరికి, వారింటిముందుగా వాడెవడో పారిపోయిన వాడి పోలికలన్ని ఉన్న కుఱ్ఱకుంక వడివడిగా పోతున్నాడు. మారుమాటాలోచించకుండా వెనుకపాటుగా వెళ్ళి గబుక్కున వాటేసుకొని వాళ్ళింటికి లాక్కొని వచ్చాను.

అప్పుడే సుబ్బారావుగారు కాబోలు బొజ్జ ఊపుకొంటూ యమధర్మరాజును తలపిస్తూ వాకిట్లోకి వచ్చారు. నన్ను, చేతిలోని వారబ్బాయిని చూచి 'ఏమిటండోయ్ మా అబ్బాయిని అంగడికి పంపిస్తుంటే ఇటు లాక్కొచ్చారు. ఇంతకీ మిమ్మల్నేమన్నా అన్నాడా!" అని ప్రశ్నలవర్షం కురిపించాడు.

నేను మెల్లిగా విషయము గొణిగాను.

"ఓ! అదా, కుఱ్ఱకుంకలు ఎక్కడికి వెళ్తారండి. ఏదో అలిగి రెండురోజులు వాళ్ళ స్నేహితుని ఇంట్లోఉండి వాడే తిరిగి వచ్చాడండీ" అని సవినయముగా చెప్పారు.

ఇక నా అన్వేషణకు సిగ్గుపడి ఈ జన్మలో ఇటువంటి కార్యాలకు పోబోనని నెత్తిన గుడ్డ వేసుకొని వచ్చాను ★

—తుమ్మల రాఘవరావు

## రేణుక

కమలమ్మ సంతోషంగా 'నిజంగా నే! అంతా ఆ రామచంద్ర ప్రభువు దయ. ఏమండీ అమ్మాయి వెళ్ళేప్పుడు అన్నీ పెట్టి పంపించవద్దూ' అంది.

"అవన్నీ ఇప్పుడు వద్దని వ్రాశాడే, మరోసారి పెట్టి పంపించవచ్చులే" అంటూ, 'అమ్మాయి ఏది' అని అడిగాడు.

'గదిలో వుంది,' అంటూ, "అమ్మాయ్ నాన్న పిలుస్తున్నారు. పిలుస్తున్నారే" అంటూ కేకవేసింది కమలమ్మ. రేణు బయటకు వచ్చి తలితండ్రుల సంతోషం అర్థంగాక చూస్తూ నిలుచుండిపోయింది.